క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా రమేశ్



రమేశ్‌ను సన్మానిస్తున్న నవీన్‌రాజ్

రామన్నపేట : నగరంలోని వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్‌గా ఇరుకుల్ల రమేశ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు దేవాలయ కార్యనిర్వహణ అధికారి రత్నాకర్‌రెడ్డి, దేవాదాయ శాఖ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శేఖర్ హాజరై ఎన్నికైన నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ సభ్యులుగా కొత్త వెంకటకృష్ణ, రజినీకాంత్, సురేశ్, భాగ్యలక్ష్మిలు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్ రమేశ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తేజస్విని శిరీష్, డివిజన్ అధ్యక్షులు రజినీకాంత్, అర్చకులు పాల్గొన్నారు.

'ఎల్‌బీ'లో స్వచ్ఛభారత్

రామన్నపేట : నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ఎన్‌సీసీ పదో బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో బుధవారం 'ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాతి' కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో మెడిసినల్ ప్లాంట్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి క్లీన్ చేసినట్లు తెలిపారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌ఎస్ రామదురై, ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కళాశాల చైర్మన్ భాగ్యనారాయణ, సెక్రటరీ వినయ్‌కుమార్, కెప్టెన్ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్‌కు సన్మానం



విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్య నూతన జాయింట్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బాలభాస్కర్‌ను హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి బుధవారం హైదరాబాద్‌లో కళాశాల విద్య కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించి పూలబొకేను అందజేసి అభినందించారు. అలాగే ఇటీవలనే కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రప్రసాద్‌ను కూడా దుశ్శాలువా కప్పి సన్మానించి పూలబొకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు ఉన్నారు.

రైల్వే సీనియర్ డీఈఈని కలిసిన నాయకులు



కాజీపేట రూరల్ : స్థానిక రైల్వే డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ (టీఆర్‌ఎస్)గా బాధ్యతలు చేపట్టిన కేవీ.హరికృష్ణను బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వేమజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. వారి వెంట సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డీజిల్ బ్రాంచీ సెక్రటరీ పాక వేదప్రకాశ్, ట్రెజరర్ రాజేశ్వర్‌రావు, తిరుపతి, యాదగిరి, నాగరాజు, ఎస్.శ్రీనివాస్, రవీందర్, క్రాంతి పాల్గొన్నారు.

హోంగార్డుకు సీపీ సత్కారం



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘ కాలం హోంగార్డుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రవికుమార్‌ను బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగయ్య, ఆర్‌ఐలు చంద్రశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

జలమయమైన ఆర్‌యూబీ

- విధులకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న రైల్వే కార్మికులు
- ప్లానింగ్, డ్రెయినేజీ సిస్టం లేక నిలుస్తున్న వర్షపు నీరు
- మోటార్ల సాయంతో బయటికి పంపిస్తున్న సిబ్బంది



అండర్ బ్రిడ్జి కింద నిల్వ ఉన్న వర్షపునీరు



ఆర్‌యూబీ లోపలి నుంచి ఎవరు వెళ్లకుండా స్టాప్ గేట్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్ వద్ద ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వర్షాలకు వర్షం నీరు చేరి జలమయమై రైల్వే కార్మికుల విధులకు ఇబ్బందికరంగా మారింది. డీజిల్ లోకోషెడ్‌లో పని చేస్తున్న రైల్వే అధికారులకు, కార్మికుల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు నాలుగేళ్ల క్రితం ఈ బ్రిడ్జిని నిర్మించారు. అధికారులు, కార్మికులు అయోధ్యపురం రైల్వేగేట్ వద్ద రోడ్డు మార్గం నుంచి, డీజిల్‌కాలనీ రైల్వేడ్రైవర్ల ట్రెనింగ్ స్కూల్ వద్ద నుంచి ఆర్‌యూబీలో నుంచి డీజిల్‌షెడ్‌కు వాహనాలపై రాత్రి, పగలు విధులకు వెళ్లి వస్తుంటారు. ప్రతి వర్షాకాలం వర్షాలు పడినప్పుడు నీరు పెద్ద ఎత్తున చేరడంతో బ్రిడ్జి జలమయమై అధికారులు, కార్మికుల విధులకు ఆటంకంగా మారుతుందని కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం అధికారులు, కార్మికులు డీజిల్‌షెడ్ ఎదుట పుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా, వేరేమార్గాల గుండా విధులకు వెళ్లి వస్తున్నారు. అండర్‌బ్రిడ్జి నిర్మాణంలో సరైన ప్లానింగ్ లేకపోవడం, వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేనందున, రైల్వేట్రాక్‌కు 5 మీటర్ల వరకు లోలెవెల్‌గా బ్రిడ్జి నిర్మాణం ఉండడంతో వర్షంనీరు చేరి ఎటూ వెళ్లలేకపోవడంతో వర్షం పడిన ప్రతీసారి పెద్ద సమస్యగా మారుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన ప్లానింగ్ లేకుండా అండర్‌బ్రిడ్జి నిర్మించి రైల్వే డబ్బులను వృథా చేశారని అంటున్నారు. బ్రిడ్జిలోకి వర్షం నీరు చేరడంతో అధికారులు ఎవరూ లోపలి నుంచి వెళ్లకుండా మూడు మార్గాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బ్రిడ్జి లోపలికి చేరిన వర్షం నీరును మోటార్ల సాయంతో బయటికి పంపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఏది ఏమైనా ఆర్‌యూబీ లోపల వర్షం నీరు నిల్వకుండా, రైల్వే కార్మికుల విధులకు ఆటంకాలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైల్వే కార్మికులు కోరుతున్నారు.

దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి: రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను తీరు పరిశీలిస్తూ అందుకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారని అడిగారు. సాదా బైనామా కింద ఎన్ని దరఖాస్తులు అందాయని తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తుదారుడికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రహీం, ఆర్‌ఐ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలాదేవికి డాక్టరేట్



హసన్‌పర్తి : కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న నిర్మలాదేవి డాక్టరేట్ అందుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ (హైదరాబాద్) పీ.హెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసింది. 'అనాలిసిస్ అండ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ బ్లైండ్ ఈక్వలైజేషన్ అండ్ మల్టీయూజర్ డిటెక్షన్ సిస్టమ్స్ ఇన్‌డిస్పెర్సివ్ ఛానెల్స్' అంశంపై పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించారు. నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.కిషన్‌రావు పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కోశాధికారి నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈసీఐఈ విభాగాధిపతి డాక్టర్ శివానీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారిలు అభినందించారు.

ఔషధ పరిజ్ఞానంతోనే ఉద్యోగాలు

- తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం



విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న మల్లేశం

ఖిలా వరంగల్ : ఫార్మసీ విద్యార్థుల మంచి భవిష్యత్ ఉందని, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు ఔషధ పరిజ్ఞానం పెంపొందించుకుంటే ఉద్యోగాలు సులభంగా లభిస్తున్నాయని తాళ్లపద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ వరుణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఉర్సుగుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో మెడిప్లస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తాళ్ల పద్మావతి ప్లేస్‌మెంట్ సహకారంతో ఫార్మసీ విద్యార్థులకు స్పెషల్ ప్లేస్‌మెంట్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశ విదేశాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. స్పెషల్ డ్రైవ్‌కు 45 మంది హాజరుకాగా 15 మంది ఎంపికైన విద్యార్థులకు కంపెనీ నిర్వాహకులు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు సాయిషైలేశ్ (మెడిప్లస్ అసిస్టెంట్ మేనేజర్) ఎండీ. తాజోద్దిన్, శుభం, రాజు, డాక్టర్ బేతి శ్రీనివాస్, బి.పృష్టి, వై.సురేంద్ర, ఎ.జ్యోత్స్న, కె.మాధవి, టి.రమ్య కృష్ణ పాల్గొన్నారు.

వీసీ ప్రతాప్‌రెడ్డికి అభినందనల వెల్లువ



కేయూ క్యాంపస్ : అమెరికాలో కేయూ ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని అలాగే వివిధ చోట్ల పర్యటించి వచ్చిన కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డిని బుధవారం టీచింగ్, నాన్‌టీచింగ్ వివిధ సంఘాల బాధ్యులు కలిసి అభినందించారు. పూలబొకేలను అందజేసి అభినందించారు. కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగ సతీశ్ వీసీని కలిసి పూలబొకేను అందజేసి అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రామన్నపేట : కొత్తవాడలో బస్వరాజు వెంకటేశ్వర్లు మృతి చెందడంతో ఆ కుటుంబానికి బుధవారం కాకతీయ రజక వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా చైర్మన్ బస్వరాజు శ్రీమాన్ రూ. 11 వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా పేద ప్రజల విద్యకోసం, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. అందజేసిన వారిలో పెద్ద వెంకటేశ్వర్లు, పెద్ద చేరాలు, చిన్న చేరాలు, ఎల్లయ్య.. సారంగపాణి ఉన్నారు.

హసన్‌పర్తి : ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ముచ్చర్లకు చెందిన కంచనకుంట్ల రాజు కుటుంబానికి శ్రీసాయి స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చింది. బుధవారం ఆ కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు ఇంద్రాసేనారెడ్డి, శ్రీధర్, రాజేష్, హరిప్రసాద్‌రెడ్డి, గణపతిరెడ్డి, ఇంద్రన్న, నాగరాజు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



హసన్‌పర్తి: దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించే రావణ వధకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజును ఆహ్వానించారు. బుధవారం ఎర్రగట్టు యూత్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్, సురేందర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో మల్టీపర్పస్ హెల్త్‌క్యాంపు



హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న డాక్టర్ సంధ్యారాణి, తదితరులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిలో బుధవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రైల్వే ఆస్పత్రి–ప్రైవేట్ ఆస్పత్రుల వైద్య బృందం మహిళలకు మల్టీపర్పస్ హెల్త్ క్యాంపు నిర్వహించింది. కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి సీనియర్ డీఎంఓ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ నరేందర్ హిర్వానీ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి గైనకాలజిస్ట్ డాక్టర్ సంధ్యారాణి, న్యూరాలజీ డాక్టర్ నవీన్, న్యూట్రిషనిస్ట్ డాక్టర్ అనూష, ఆర్థోపెడిషన్ డాక్టర్ ఉత్తమ్ పాల్గొని ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా బాగుంటుందన్నారు. విధి నిర్వహణలో మహిళలు, రిటైర్డ్ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించే విషయాలపై అవగాహన కల్పించినట్లు రైల్వే సీనియర్ డీఎంఓ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వసంతకుమారి, సెక్రటరీ డాక్టర్ గీతాంజలి, ట్రెజరర్ మంజుల, రైల్వే డాక్టర్లు ధీరజ్, హరిబాబు, విన్నీ, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌చంద్ బైరవ, రైల్వే ఆస్పత్రి స్టాఫ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన హజ్‌కమిటీ బాధ్యులు



న్యూశాయంపేట : ఇటీవల ఖిలావరంగల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ ఇక్బాల్‌ను వరంగల్ జిల్లా హజ్‌కమిటీ బాధ్యులు బుధవారం కలిసి పూలమాలతో సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు సర్వర్ మోహియోద్దీన్ ఘాజీ, మహ్మద్ షర్ఫొద్దీన్, చింతల్ మజీద్ కమిటీ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మానసిక అభివృద్ధి కేంద్రంను ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది సందర్శించారు. చిన్నారులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.

చంద్రక్క ఐదో సంస్మరణ సభ

మామునూరు : ఖిలావరంగల్ మండలం నక్కలపల్లిలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు పైలా చంద్రక్క, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.ముక్తార్ పాషాల ఐదో సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుల బండి కోటేశ్వరరావు హాజరై చంద్రక్క, ముక్తార్ పాషా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింగం, సాంబయ్య, యాకయ్య, ప్రభాకర్, రాజు, నారాయణ, ఎల్లయ్య, పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్, కాజీపేట మెయిన్ రోడ్, జూబ్లీమార్కెట్, మజీద్ ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శంభులింగేశ్వరస్వామికి నూతన కమిటీ దర్శనం

ఖిలా వరంగల్ : చారిత్రక ప్రసిద్ధి చెందిన స్వయంభూ శ్రీ శంభులింగేశ్వరస్వామిని బుధవారం కాంగ్రెస్ నేతలు నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్‌తో నూతన కమిటీ దర్శించుకున్నారు. అనంతరం దేవాయదాయశాఖ అధికారులు కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీనివాస్, దూడయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధనమైసమ్మకు పూజలు

ఖిలా వరంగల్ : చారిత్రక ప్రసిద్ధిచెందిన మెట్ల బావి వద్ద శ్రీధనమైసమ్మకు బుధవారం కూష్మాండ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన పూజారి దూదాటి మోహన్, శర్మ ఆధ్వర్యంలో కూష్మాండ, ఖడ్గం పూజను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా 35వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ మేరుగు అశోక్, 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి హాజరై ధనమైసమ్మను దర్శించుకుని ఆయుధ పూజ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం సత్యనారాయణ ఆలయం వద్ద జమ్మిపూజకు రూపొందించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుంచు మాధవ్, బైరి శ్యామ్, గడ్డం రవి, ప్రభాకర్, సుంచు భాగ్యమ్మ, రాజేంద్రప్రసాద్, పాలెపు శ్రీనివాస్, సుంచు కేశవ్, కపిలవాయి శ్రీదేవి, మధుసూదన్, అఖిల్, బాబు, తదితరులు పాల్గొన్నారు

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



న్యూశాయంపేట: కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ/న్యూశాయంపేట : దసరా ఉత్సవాలు సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం మడికొండలోని రామలీల మైదానం,14వ డివిజన్ దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ, దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలన్నారు. సమాజంలో ఐకమత్యం, సత్సంకల్పం, ధర్మం కోరకు పోరాడిన శ్రీరాముని మహోన్నతను గుర్తు చేస్తాయన్నారు. అనంతరం వరంగల్ లక్ష్మిగణపతి కాలనీలో ఏర్పాటు చేసిన దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నాయకులు బైరి లింగమూర్తి, బిల్ల రవీందర్, కుర్ల మోహన్, రఘుచందర్, శ్రీనివాస్, శంకర్, నాగరాజు, రజినీ వేణుయాదవ్, నవీన్‌యాదవ్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్ద పీట

హసన్‌పర్తి: కాంగ్రెస్ సర్కార్ సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని అన్నాసాగరంలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైనవారికి పథకాలు వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత మడిపల్లిలో నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మాజీ సర్పంచ్ సుమలత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చంటిరెడ్డి, విజయ్, బుచ్చిరెడ్డి, రామంచ ఐలయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు బతుకమ్మ సంబురాలు



కేయూ ఇంజనీరింగ్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్, మహిళా సిబ్బంది



హన్మకొండ అర్బన్ : బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జిల్లా సహకార అధికారి నీరజ



ఖిలావరంగల్ : కరీమాబాద్‌లోని కెవీ స్కూల్‌లో..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యూకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మహిళా సిబ్బంది బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఆయన అన్నారు.

ఖిలా వరంగల్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు కాపాడుకోవాలని కెవీ స్కూల్ ప్రిన్సిపాల్ దాసి సతీశ్‌మూర్తి అన్నారు. బుధవారం కరీమాబాద్ రోడ్డు ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని కెవీ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

హన్మకొండ అర్బన్ : నగరంలోని జులైవాడ బన్ను న్యూరో హెల్త్ రిహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం బతుకమ్మ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా సహకార అధికారి నీరజ హాజరై మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు.

నిరుద్యోగుల నిరసన



లైబ్రరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

హన్మకొండ చౌరస్తా : ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో అశోక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా బుధవారం హనుమ కొండలోని జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనన కార్యక్రమంలో సుమారు 200ల మంది నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు



మడికొండ : పూజలో పాల్గొన్న భక్తులు





గాయత్రీ దేవి అలంకరణలో శ్రీలలితాదేవి, రామన్నపేట : ప్రత్యేక అలంకరణలో శారదాదేవి

రామన్నపేట : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీ శారదాదేవికి ఉదయం గోపూజ, సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం చేసి విశేష అలంకరణ చేసి ఆయుష్య హోమం నిర్వహించినట్లు శంకరమఠం ప్రధానార్చకులు సంగేమేశ్వర జోషి తెలిపారు. అనంతరం సామూహిక లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించినట్లు తెలిపారు.

దేవీమాత వద్ద ప్రత్యేక పూజలు

మడికొండ : మడికొండ చౌరస్తాలో సుభాష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీమాత విగ్రహం వద్ద బుధవారం ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు భాస్కర్, కుమార్, రవి, నరేష్, సాంబరాజు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక అలంకరణ

కాజీపేట: కాజీపేట పట్టణంలో కొలువుదీరిన శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ఒడితెలా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు జరిపించి ఆలయ ట్రస్టు సభ్యులు బుర్ర జనార్ధన్ గౌడ్ అందించిన వస్త్రాలతో స్వామి వారికి అలంకరణ చేశారు.

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీలలితాదేవి ఆలయంలో గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. బుధవారం ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర్ల చార్యుల ఆధ్వర్యంలో శ్రీలలితాదేవిని గాయత్రీ గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వోడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేష్, రవికంటి అశోక్, అడెపు శ్యాం, తదితరులు పాల్గొన్నారు